అందవ గోపాలకృష్ణమూర్తి

# కలల పంట



"రామయ్యా!"-

ఆనందమూర్తి పిలుపు విని ఒక్క పరుగులో వచ్చి వినయంగా నిల్చున్నాడు రామయ్య.

"మధ్యాహ్నం రిషిబాబొస్తున్నాడు. ఇదిగో ఇప్పుడే టెలిగ్రామొచ్చింది. పదిన్నరనుంచీ కారుని బస్టాండులో ఉంచమని డ్రైవరు రాగానే చెప్పు.

నువ్వేమో అబ్బాయి రూమ్ శుభ్రంగా క్లీన్ చేసుంచు."

"అలాగే బాబూ!"

"బెడ్‌షీట్లన్నీ మార్చు; స్టీరియో సెట్ గాద్రేజ్ అల్మారాలో లాక్ చేసుంది, అమ్మగారి కీ–బంచ్‌లో తాళ ముంది. తీసుకుని, రిషిబాబు రూమ్‌లో అన్నీ ఎరేంజ్ చెయ్!"

"అయ్యా. . ."

"బాబుకి చక్రపొంగలి ఇష్టం. అది చెయ్యమన్చెప్పు. జీడిపప్పు ఫ్రై చేయించు. తర్వాత, ఫ్రిజ్‌లో బీర్ బాటిల్స్ తీసేసి, నా అల్మారాలో పెట్టు. ఇంట్లో ఎక్కడా ఖాళీబాటిల్సు ఉండనీయక! రిషీకి గోల్డ్‌స్పాట్ ఇష్టం. ఫ్రిజ్‌లో ఓ కేసు పెట్టించు ఓ.కే?..."

"అలాగేనయ్యా ... ! రిషిబాబు కిందటి దీపావళికొచ్చేరు, మళ్ళీ ఇప్పుడొస్తున్నారు ఈ ఆర్నెల్లలోనూ ఎలా మారిపోయేరో ఏవిటో!!..."

"రిషీకేం... సైనిక్ స్కూలా, మరేమైనానా? మంచి డిసిప్లిన్ అబ్బుతుంది. రన్నింగ్, జంపింగ్, హార్స్‌రైడింగ్ ఒకటేమిటి, చదువుతోబాటు అన్నీ నేర్పుతారక్కడ"

"అయ్యగారూ, అబ్బాయిగార్ని ఇక్కడే చదివించకూడదా బాబూ? అక్కడ చదివినోళ్ళంతా సైన్యంలోకో, ఓడమీదకో, విమానంలోకో వెళ్ళిపోవాలంట! ఎంత పెద్ద ఉద్యోగమైనా ప్రాణంతో చెలగాటంకదు బాబూ!...'' రామయ్య కంఠంలో ఆత్మీయత ధ్వనికింది.

"రామయ్యా! మగాడివి నువ్వే ఇలాంటి పిరికిమాటలు మాట్లాడ్తే ఎలా? అందరూ నీలాగా, నాలాగా చూరుని పట్టుకు వేళ్ళాడితే సైన్యంలో కెళ్లేదెవరూ? ఓడలూ, విమానాలూ నడిపేదెవరు? చిన్నప్పట్నుంచీ ధైర్యసాహసాలున్నట్లయితే–'

"కాదు బాబూ, ఒక్కగానొక్క కొడుకు, ఆ బాబుని అలా సైన్యంలోకి పంపేస్తే..."

"ఏమౌతుంది? అవసరమొస్తే హీరోలా ఫైట్ చేస్తాడు రిషిబాబు. ఇంకా అవసరమొస్తే హీరోలానే దేశంకోసం ప్రాణాలిచ్చేస్తాడు. అంతకంటే కావల్సిందేముంది? నువ్వూ నేనూ బతికుండి ఏం సాధించేం రామయ్యా? పొద్దున్నే లేచి, ఇక్కడ నీకు చాకిరీ, కాలేజీలో పాఠాలు చెప్పుకుంటూ నాకు చాకిరీ; నువ్వూ, నేనూ, ఆ రోడ్డుమీద కిళ్ళీబడ్డీ అబ్బాయీ ఇంకా మనలాంటి అందరూ రెండుపూట్లా ఎలా తిందామా, డబ్బు దస్కం ఎలా వెనకేద్దామా అనే భ్రాంతిలోపడి మన కనీస ధర్మాల్ని మర్చిపోతున్నాం. మన దేశం గురించి అటుంచి, కనీసం సంఘం గురించి అయినా ఆలోచించడమేలేదు. అందుకే ఈ వాతావరణంలో ఉంటే రిషిబాబు కూడా మనలాగే స్వార్థపు వలలో

పడిపోతాడనే భయంతో అక్కడికి పంపించేసేను అక్కడ రిషిబాబు అన్నింటిలోనూ ఫస్ట్! హి విల్ బికమ్ ఏ హీరో! గో ఎహెడ్! నీకు చెప్పిన పనులన్నీ అర్జెంటుగా చెయ్!"

"తప్పకుండా బాబూ; రిషిబాబంటే మీకే కాదు, మా అందరికీ కూడా ప్రాణం! అందుకే మాకీ తాపత్రయం! బాబొస్తే ఎంత హడావుడి, ఎంత సందడి! కోపం మాత్రం ముక్కుమీదుంటుంది! సైన్యంలో కెళితే, కోపమొస్తే టుపుక్కున అందర్నీ కాల్చేస్తారేమో రిషిబాబు-చిన్నప్పటి దీపావళి తుపాకి అనుకుని"

"అలాంటి కోపాలు, తాపాలు అన్నీ మాయమైపోతయ్ రామయ్యా అక్కడి చదువుమూలంగాను! మంచి డిసిప్లిన్, మేనర్స్ అలవాటవుతై. అదేకదా మనకి కావల్సింది! చిన్నప్పట్నుంచి డిసిప్లిన్, అంటే క్రమశిక్షణ—'

"అవును బాబూ."

"డిసిప్లిన్డ్‌గా పిల్లల్ని ఇళ్ళదగ్గర తల్లి తండ్రులు పెంచలేరు. ముద్దూ, గారం ఎక్కువైపోయి పిల్లలు సర్వసాధారణంగా పాడైపోతుంటారు. రెండేళ్ళప్పట్నుంచీ రిషిబాబు అమ్మగార్ని 'తంతా జాగ్రత్త!' అంటూ ఇష్టమొచ్చినట్టు రెక్కేస్తుండేవాడు. అమ్మ గారు ఆ మాటలు వింటూ బాబుని మరీ ముద్దు చేస్తుండేవి. తర్వాతర్వాత రిషి నామాట కూడా లక్ష్యపెట్టేవాడు కాదు. నా మాటే లెక్కపెట్టనివాడు తల్లిమాట వింటాడా? ఇక తల్లిమాట వినే ప్రసక్తే లేదు! మరి అల్లరి చేసినప్పుడు నేను కోప్పడితే 'తాతగారింటికి పారిపోతా'నని బెదిరించి అలిగేవాడు. తాతగారింట్లో రిషికి మరీ గారం! అక్కడ బాబు ఒంటి మీద ఈగనైనా వాలనివ్వరు! అసలు బాబు పాదాల్ని నేలమీదే పెట్టనీయరు. ఇప్పుడైనా చూడు, రాగానే ఓ రెండ్రోజులు ఆ 'స్టీరియో' ముందు రికార్డు లేసుకుని కూర్చుంటాడు. తర్వాత 'బోరు కొట్టేస్తుందక్కడ' అని రాజమండ్రి పారిపోతానంటాడు మనెవ్వరి మాటమీదా గురిలేదు. వాళ్ళ నాన్నమ్మ, తాత గారూను! ఇద్దర్లోనూ మళ్ళీ, నాన్నమ్మ ఉంటే చాలు, ఇంకెవ్వరూ పనికిరారు. ఇలా అతిగా గారబంచేసేస్తే పెంకి దనం పెరిగిపోతుందని బాబుమీది ప్రేమని మనసులోనే దాచుకుని అందరి ఇష్టానికీ ఎగనెస్ట్‌గా అక్కడికి పంపించేసేను! మరేం ఫర్వాలేదు, రిషిబాబు బ్రహ్మాండంగా చదువుకుంటా డక్కడ. ఊఁ...నువ్వు అర్జెంట్‌గా పనులు చూస్కో! రిషి గురించైతే నేను గంటలు గంటలు మాట్లాడ్తూనే ఉంటాను."

"అదికాదు బాబూ, పోనీ నాన్నమ్మ గారి మాట వింటాడు గదా రిషిబాబు, అక్కడే ఉంచి చదివించకూడదా బాబూ! అప్పుడప్పుడు ఇక్కడికి రావడానికి-"

"లేదు రామయ్యా, నాకు పిరికి మాత్రలు వేయబోకు! రిషిబాబుని ఒక మహత్తరమైన వ్యక్తిగా తీర్చిదిద్దాలంటే, మన దగ్గర తను పెరగకూడదు! ఫరెగ్జాంపుల్..."

"అయ్యా!..."

* * *

"చీర్స్ బాస్, ఫర్ ద హెల్త్ ఆఫ్ మాస్టర్-రిషీ ఆన్ హిజ్ బర్త్‌డే!"

"చీర్స్" మిత్రులంతా స్కాచ్ గ్లాసుల్ని 'టక టక' లాడించేరు. "స్టీరియో" లోంచి 'డారిన్-డే' పాటలు వినబడుతున్నై.

"డేడీ-నాకో!" గ్లాసు పట్టుకుని పరుగెట్టుకొచ్చేడు పుట్టినరోజు పెళ్ళికొడుకు మూడేళ్ళ రిషి.

"నో మై లవ్! నువ్వు తాక్కూడదు. ఏదీ, బర్త్-డే కిస్ మరోటియ్యి. ఊఁ... దట్సిట్..., మరి మమ్మీ ముద్దూ... ఆఁ... ఈ బుగ్గ మీద... ఊఁ... గుడ్.., ఇప్పుడు డేడీ ముద్దు?... య్యాఁ... రిషీ ఈజే గూడ్ బోయ్...., గో...గోటు మమ్మీ, మమ్మీ దగ్గరి కెళ్ళి..."

"డేడీ, అది కావాలి...కొంచెం..."

"ఛీ నాన్నా! ఆఁ, ఉండు నీకు గోల్డ్‌స్పాట్ ఇస్తా. సరేనా? దా, ఇలా కూర్చో,...ఏయ్ సన్యాసీ...రిషిబాబుకో గోల్డ్‌స్పాట్ అర్జెంట్‌గా పట్రా!"-రిషిని పళ్ళో కూర్చోబెట్టుకున్నాడు ఆనందమూర్తి. పనిపిల్ల తెచ్చిన గోల్డ్ స్పాట్‌ని సగానికి పోసి, గ్లాసుని రిషికి అందించాడు.

"చీర్స్ రిషీ!" అంటూ రిషి గ్లాసుకి అందరూ గ్లాసుల్ని తగిలించారు.

"ఓ, ఫర్ ద హెల్త్ అండ్ ప్రాస్పెరిటీ ఆఫ్ మై లవింగ్, లవింగ్ రిషీ!" ఆనందమూర్తి గ్లాసుని 'సిప్' చేసేడు.

"ఇది మరీ బావుంది, వాడికిలానే అలవాటు చేయండి. కమాన్ రిషీ, కమియర్, డేడీ ఈజ్ నాట్ గుడ్. ఐసే, కమాన్ రిషీ!"-ఎదురుగా చక్రాల్లాంటి పెద్దకళ్ళను తిప్పుతూ 'కృష్ణ'-ఆనందమూర్తి ఇంటి దీపం, అతని కలల పంట దైవం!

"కిట్టూ, రిషిబాబు గోల్డ్ స్పాట్ తీసుకుంటున్నాడు. అంతే! చిన్నపిల్లాడుగా-ఇవేమీ వాడికి అర్థమవవులే. కాస్త ఊహ వచ్చేక ఇలా కూర్చోబెట్టుకోనుగా! అదీకాక, ఇది రిషి బర్త్-డే పార్టీ, ఊఁ ...ప్లీజ్!"

ఆనందమూర్తి నోటినుంచి 'ప్లీజ్!' అన్న పదం వింటే కృష్ణ మరింకేమీ మాట్లాడదు. ఆమె అతని ప్రాణం! అతను ఆమె సర్వస్వం! ఆమె నోటి నుండి 'ప్లీజ్ డోంట్ టచ్ ద డ్రింక్' అని అతను వింటే, ఆ క్షణాన్నే ఆ పార్టీ కేన్సిలైపోతుంది. అతనేం చేసినా ఆమె అడ్డుచెప్పదు. అందుకే, ఏ పనికైనా సరే, ఆమె అంగీకారాన్నతడు అభ్యర్థిస్తాడు. అతనూ-ఆమే-వాళ్ళ కలల పంట రిషీ!-ఇదే వాళ్ల సంసారం, ఇదే వాళ్ల సర్వస్వం, ఇదే వాళ్ల స్వర్గం!

స్టీరియోగ్రామ్ నుంచి 'డోరిస్డే' ఫేమస్-సాంగ్; "కేసరా-సరా, వాటెవర్ విల్ బీ-విల్ బీ; ద ఫ్యూచర్-ఈజ్ నాట్-అవర్స్ టుసీ, కేసరా—సరా; వాటెవర్-విల్ బీ, విల్ బీ!" ప్రారంభమైంది.

"హాో, ఈ పాటనే గదా, ఏదో సినిమాలో మన భానుమతి కూడా పాడుతుంది?" ఓ మిత్రుడు ప్రశ్నించేడు.

"ఔనండీ, మా రిషీ ఫేవ్రెట్ పాటిది. అస్తమానం అదే పెట్టమంటాడు."-కృష్ణ సమాధాన మిచ్చింది.

"అమ్మయ్య, థేంక్స్ టు—'డోరిస్-డే'—టాపిక్ మారినందుకు మనసులోనే అనుకున్నాడు ఆనందమూర్తి.

అంతలోనే అరగ్లాసు గోల్డ్‌స్పాట్‌ని అదేపనిగా కొట్టేసిన రిషీ మళ్ళీ ఖాళీ గ్లాసు పట్టుకుని, "డేడీ, నాకు గోల్డ్‌స్పాట్ ఇంకొద్దు. అదికావాలి!" అంటూ టేబుల్ మధ్య నున్న 'రాయల్ శాల్యూట్' విస్కీ బాటిల్ చూపించేడు.

"ఛప్, అది విషం నాన్నా. నువ్ తాకూడదు."

"మరి, డేడీ, నువ్వెందుకు తాగుతున్నావ్ విషాన్ని?"

"ఇవేళ నీ పుట్టిన్రోజు కదా, నా ఫ్రెండ్సొచ్చారుగా పార్టీకి, అందుకూ!"

"నా పుట్టిన్రోజు గనక నేనూ విషం తాగుతా, డేడీ!"

"షటప్ రిషీ, నువ్వు లోపలికి పో!" కసిరేడు ఆనందమూర్తి.

"మమ్మీ!..."అంటూ గ్లాసు క్రిందకి విసిరికొట్టి, "డేడీ తిట్టేసేరు" అని ఏడుస్తూ 'మమ్మీ' దగ్గరకు పరుగెత్తేడు రిషి. "లేదు నాన్నా, రా,...డేడీ జట్టు పచ్చి..." అంటూ రిషి బుగ్గల మీద ముద్దుల్ని గుమ్మరిస్తూ లోపలికి తీసుకుపోయింది కృష్ణ.

"హాో, యార్, యూ ఆర్ లక్కీ! మీ శ్రీమతిగారు నిజంగా సీతమ్మలాంటి వారు—"

"నో నో నో—ఆవిడ్ని సీతమ్మతో పోల్చకండి. ఎందుకంటే, సీతమ్మ పడిన కష్టాల్లో ఒక్కటి కూడా లేకుండా నా కృష్ణని పువ్వుల్లో పెట్టి అపురూపంగా చూసుకునే శక్తి నాలో వుంది. ఆలనాటి శ్రీరాముడు అమాయకుడు. అందుకే ఆయన దేవుడై కూర్చున్నాడు. నేను చాలా గడుసరివాణ్ణి. అందుకే ఆనంద మూర్తి నయ్యి, ఇలా వెలిసేను!"

అందరూ ఆనందంగా నవ్వేరు.

"కమాన్, గోఎహెడ్ విత్ యువర్ డ్రింక్స్ ప్లీజ్!"—ఖాళీ అయిన గ్లాసుల్లో విస్కీ నింపేడు ఆనందమూర్తి.

*  *  *

"అలాగ, పిల్లలకి పెంకిదనం ఎక్కువైపోతుంది, అందుకే-"

"ఔను బాబూ, ఒక విధంగా తప్పంతా చేసిందే రైటు. రిషిబాబంటే తమకెంత ప్రేమో మాకు తెలీందేముంది? సరే బాబూ...కొంచెం డబ్బా, బాబు

గారి గది తాళాలూ ఇప్పించండి... ఏర్పాట్లన్నీ నేను చూసుకుంటాను-"

"అమ్మగారి దగ్గరున్నాయని చెప్పేనుగా, తీస్కో. ప్రతి చిన్న విషయానికీ నన్నడక్క !..."

"చిత్రం బాబూ!" వినయంగా లోపలికెళ్ళిపోయాడు రామయ్య.

తూర్పు దిక్కునుండి ఏడు గుర్రాల రథంమీద ఆకాశపు చెత్తుకు ఎగబ్రాకే ప్రయత్నంచేస్తున్న బాలభానుని కిటికీలోంచి చూస్తూ, రిషిబాబు భవిష్యత్తును తీర్చిదిద్దే ఊహల్లో నిమగ్నమైపోయాడు ఆనందమూర్తి.

* * *

మెల్లగా అమ్మగారి గదితలుపు తెరిచాడు రామయ్య. అమ్మగారంటే అతనికి విపరీతమైన భక్తీ, గౌరవమూను. ఆమెకి ఎదురుగా అతను మామూలుగా నిల్చోలేడు. ఓ దేవతను చూస్తున్న అనుభూతితో కంపించిపోతుంటాడు. అమ్మగారు మాత్రం రామయ్యను ఎన్నడూ, ఏపీ పల్లెత్తుమాట కూడా అనరు. అతను అతి నమ్మకస్థుడనీ, అయ్యగారికి అత్యంత ప్రీతిపాత్రుడనీ, స్వామిద్రోహి ఏ మాత్రం కాడనీ ఆమెకు బాగా తెలుసు!

"అమ్మగారూ !" వినీ విన్పించనట్టు రామయ్య కంఠం.

లోపల అగరువత్తుల సుగంధం...

దైవ ప్రార్థన జరుగుతున్నట్టు నిశ్శబ్దం.

ఎదురుగా-బల్లమీద వెలుగుతున్న దీపం...

మెల్లగా చుట్టూ కలయజూశాడు రామయ్య. ప్రక్కనే, డ్రెస్సింగ్ టేబుల్ మీద, టాయిలెట్ సామానూ, ఆ ప్రక్కన బంగారు ఆభరణాలూ; వాటి వెనుక వజ్రాల నెక్లెన్, రవ్వల దుద్దులు, రిస్ట్ వాచీ...

అద్దాల బీరువాకు వ్రేళ్ళాడుతున్న తాళాలూ, హేంగర్స్‌కు తగిలించిన పట్టు చీరలూ, నైట్ గౌన్సూ, బెడ్‌మీద రిషిబాబు కోసం సగం అల్లిన వూల్ స్వెటరూ; బెడ్ ప్రక్క టేబుల్ మీద 'అయ్యగారూ, అమ్మగారూ' తాజ్‌మహల్ ముందు తీయించుకున్న రంగుల ఫొటో, దాని ప్రక్కన ఫొటో ఫ్రేంలో రిషిబాబు పుట్టినరోజు ఫొటో...

"అమ్మా ! బీరువా తాళాలూ, రిషిబాబు గది తాళాలూ... అయ్యగారు... తమర్ని... అడిగి..... తీసుకోమన్నారు, తీసుకెళ్ళమంటారా ?..." రామయ్య కంఠంలో భక్తితో కూడిన వణుకు.

"వేరే చెప్పాలా, తీస్కో రామయ్యా !" అని ఆమె అంగీకరించిందా అన్నట్టుగా, ఎనిమిది సంవత్సరాలు పాతపడిన అమ్మగారి చిత్తరువుమీద వ్రేలాడుతున్న పూలదండ, బొటబొటా రాల్తున్న, రామయ్య కన్నీటిబొట్ల మీద 'టప్'మని జారిపడింది.

———